సాక్షి చిత్తూరు

బుధవారం । 8 । నవంబర్ । 2023



భరత్‌కు అవకాశం ఇవ్వరూ!

ఎమ్మెల్సీ భరత్‌కు కుప్పం ఎమ్మెల్యేగా వచ్చే ఎన్నికల్లో ఒక అవకాశం ఇవ్వండని ఆయన సతీమణి దుర్గ పేర్కొన్నారు. - 10లో



రైతుకు'భరోసా'!

'రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన సీఎం జగనన్న ఏటా రైతు భరోసా అందజేస్తున్నారు' అని మంత్రి రోజా అన్నారు. - 10లో



రూ.లక్ష విరాళం

కాణిపాకం(యాదమరి): కాణిపాకంలో నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన పండుబాబు రూ.లక్ష విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

నేడు కార్వేటినగరంలో జగనన్నకు చెబుదాం



శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8వ తేదీన కార్వేటినగరంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం కార్వేటినగరం మండలం ఎంపీడీఓ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. గైర్హాజరైతే శాఖాపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ హెచ్చరించారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబర్ 9వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా న్యాయసేవా సదన్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ బీమా, మోటారు వాహనాలు, చిట్‌ఫండ్, చెక్‌బౌన్స్ కేసులతో పాటు రాజీ చేసుకోదగిన క్రిమినల్, సివిల్ కేసులను అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. కేసులను రాజీ చేసుకునే కక్షిదారులు సమీపంలోని పోలీస్ స్టేషన్, చిత్తూరులోని పాత కోర్టు భవనంలో ఉన్న న్యాయసేవా సదన్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీసులు, న్యాయవాదులు చొరవ చూపాలని కోరారు.

అవగాహన సదస్సు రేపు

చిత్తూరు కార్పొరేషన్: పారిశ్రామిక అభివృద్ధి విధానం (ఏపీఐడీపీ) 2023–2027పై గురువారం పుంగనూరులో నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు డీఐఓ చంద్రశేఖర్ తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

స్కూల్ అసిస్టెంట్ సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గంగవరం మండలం మండిపేటకోటూరు జెడ్పీ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లిషు)గా పనిచేస్తున్న కృష్ణమూర్తిని సస్పెండ్ చేస్తూ డీఈఓ విజయేంద్రరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ టీచర్‌పై గంగవరం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ కేసు ఆధారంగా కృష్ణమూర్తిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు డీఈఓ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులపై వివక్ష తొలగింపునకు అవగాహన

చిత్తూరు రూరల్: కుష్టువ్యాధిగ్రస్తులపై సమాజంలో ఉన్న వివక్ష తొలగింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి తెలిపారు. చిత్తూరులోని తన కార్యాలయంలో ఆమె మంగళవారం కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కుష్టువ్యాధి లక్షణాలపై ప్రజలకు తెలియజేయాలన్నారు. లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి, తగిన పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో టీబీ అధికారి వెంకట ప్రసాద్, డీఐఓ రవిరాజు, హెచ్ఈఓ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

16న వైస్ ఎంపీపీ-2 ఎన్నిక

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న పెనుమూరు వైస్ ఎంపీపీ-2 ఎన్నిక ఈనెల 16వ తేదీన నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సహానీ ఉత్తర్వులు జారీ చేశారు. పెనుమూరు వైస్ ఎంపీపీ-2 అరుణ ఇటీవల గుండెపోటుతో మరణించారు. దీంతో ఆ పదవి భర్తీకి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది.

భరోసాతో సాగు

'రైతు దేశానికి వెన్నెముక. అతను క్షేమంగా ఉంటేనే అన్ని వర్గాల వారు సుఖశాంతులతో ఉంటారు. అన్నదాత ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తేనే సమాజ జీవనచక్రం ముందుకు నడుస్తుంది. అందుకే సీఎం జగనన్న అతడి సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా అందిస్తున్నారు. దీంతో రైతు భరోసాతో పంట సాగు చేసుకుంటున్నారు.' అని రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి అన్నారు.

- ఘనంగా వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ నిధుల విడుదల
- కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కార్యక్రమం నిర్వహణ
- వరుసగా ఐదో ఏడాది రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ
- జిల్లాలో 2,31,144 మంది రైతులకు రూ.94.29 కోట్ల లబ్ధి



రైతు భరోసా మెగా చెక్కును రైతులకు అందజేస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

చిత్తూరు కలెక్టరేట్ : రైతులకు వైఎస్సార్ సీపీ సర్కారు వెన్నుదన్నుగా నిలుస్తోందని రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఐదో సంవత్సరం రెండో విడత వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకం ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. పుట్టపర్తి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు వర్చువల్ విధానంలో వీక్షించారు. అనంతరం రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి మాట్లాడుతూ గత పాలకులు వ్యవసాయం దండగ అన్న పరిస్థితులను నేడు వైఎస్సార్‌సీపీ సమూలంగా మార్చిందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు వైఎస్సార్ రైతు భరోసా భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా సహాయం అందిస్తోందన్నారు. రైతు సుభిక్షంగా ఉండాలన్నదే ప్రభుత్వం ధ్యేయమని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా వరుసగా ఐదో ఏడాది రెండో విడతలో 2,31,144 మంది రైతులకు రూ.94.29 కోట్లను ప్రభుత్వం జమ చేస్తున్నట్లు వెల్లడించారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ రైతుల ముఖాల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిరునవ్వు నింపారని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ రమ్య మాట్లాడుతూ రైతుల కష్టాలను స్వయంగా పాదయాత్రలో చూసిన సీఎం జగనన్న రైతుభరోసా పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ కుల, పార్టీ, మతాలకతీతంగా తమ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తోందని చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటివరకు మొత్తం రూ.1,391 కోట్లు లబ్ధి చేకూర్చడం జరిగిందని తెలిపారు. అనంతరం ఐదో ఏడాది రెండో విడత రైతుభరోసా మెగా చెక్కును రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్ పర్సన్ శైలజా రెడ్డి, జెడ్పీ మహిళా స్థాయి సంఘం చైర్ పర్సన్ భారతి, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు. భరోసా అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆ సంతోషం వారి మాటల్లోనే..



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

సీఎం మేలు ఎప్పటికీ మరువలేం



సీఎం మేలును ఎప్పటికీ మరిచిపోలేం. రైతుల సంక్షేమం గురించి ఆలోచించింది సీఎం జగనన్న ఒక్కరే. ఏటా క్రమం తప్పకుండా రూ.13,500 రైతుభరోసా ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయంతో మేము అప్పులు చేయాల్సిన పరిస్థితి తప్పింది. – రేవతి, కొత్తపల్లి, లబ్ధిదారు, గుడిపాల మండలం

సరైన సమయంలో ఆర్థిక సహాయం



పంట సాగుకు అవసరమైన సరైన సమయంలో ప్రభుత్వం సహాయం అందజేస్తోంది. నేను ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయంతో టమాట, వేరుశనగ పంటలు పండించుకుంటున్నాను. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టపోయినప్పుడు అధికారులు నేరుగా వచ్చి పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం కూడా అందింది. – షర్మిళ, లబ్ధిదారు, తుమ్మిందపాళెం, చిత్తూరు రూరల్ మండలం

రైతులకు ఎంతో మేలు



రైతు భరోసా పథకంతో కర్షకులకు ఎంతో మేలు జరుగుతోంది. రైతు దేశానికి వెన్నెముఖలాంటి వారని నమ్మిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మమ్మల్ని ఆదుకుంటున్నారు. గతంలో వ్యవసాయం చేయాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. – కనకదుర్గ, లబ్ధిదారు, గంగాధరనెల్లూరు మండలం

పకడ్బందీగా ఓటర్ల జాబితా పరిశీలన



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు జేసీ వివరించారు. ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియపై విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనా జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి వీసీలో పాల్గొన్న జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఒక్కొక్క ఇంట్లో 10 ఓట్లకు పైగా ఉన్న ఓటర్ల గృహాలను పునఃపరిశీలిస్తున్నట్లు చెప్పారు. త్వరలో ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. డబుల్ ఎంట్రీలు 10,607 వచ్చాయని, ఆ ఓట్లు 842 గృహాల్లో ఉన్నట్లు తెలిపారు. వాటిని పకడ్బందీగా పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్వో రాజశేఖర్, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

10న జిల్లా స్థాయి సైన్స్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని గంగినేని చెరువు వద్ద ఉన్న విజ్ఞానదీప్తి పాఠశాలలో జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 210 సైన్స్ ప్రాజెక్టులతో విద్యార్థుల పాల్గొంటారని చెప్పారు. పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఆప్‌కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ భువనేశ్వరిని ఆదేశించారు. ఆరు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులతో పాల్గొంటారని చెప్పారు. ఇందులో గెలుపొందే విద్యార్థులు ఈ నెల 29వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని డీఈఓ వెల్లడించారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

చిత్తూరు కార్పొరేషన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శర్మ తెలిపారు. మంగళవారం జిల్లా గ్రంథాలయంలో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో పిల్లలకు చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈనెల 9,10 తేదీల్లో వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. వారోత్సవాల ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి లలిత, గ్రంథాలయాధికారి మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

శిశు సంరక్షణపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్

చిత్తూరు రూరల్: శిశు సంరక్షణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ సూచించారు. చిత్తూరు నగరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మంగళవారం శిశు సంరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. శిశు సంరక్షణపై నిర్లక్ష్యం తగదన్నారు. 0–5 ఏళ్ల లోపు పిల్లలపై వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండాలన్నారు. అంటు వ్యాధుల అవగాహన కల్పిస్తూ పిల్లల తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలన్నారు. టీకాలను క్రమం తప్పకుండా వేసుకునేలా చూడాలన్నారు. వివాహ వయస్సుపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలను వివరించాలని చెప్పారు. ముఖ్యంగా మాతా శిశు మరణాల కట్టడికి వైద్య శాఖ అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతీదేవి, డీఐఓ రవిరాజు, ఐసీడీఎస్ పీడీ నాగశైలజ, అధికారులు లత, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఐరాల విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని మంగళవారం హెచ్ఎం కోమల తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్–19 సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి, రాష్ట్రస్థాయి అండర్–19 సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. అండర్–19 సాఫ్ట్‌బాల్ బాలుర విభాగంలో తులసి, సంతోష్, ప్రవీణ్ పాయి, బాలికల విభాగంలో రూప, జాహ్నవి, రేణుక ప్రతిభ కనబరిచారన్నారు. అలాగే విద్యార్థి లోకేష్ సైక్లింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో బాపట్లలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. అలాగే మరో విద్యార్థి గిరీష్ తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీడీ దేవ, క్రీడాకారులను పీఎంసీ చైర్మన్ రవీంద్రరెడ్డి, ఖేలో– ఇండియా ఫెన్సింగ్ కోచ్ కార్తీక్, టీచర్లు అభినందించారు.

కల్యాణం.. కమనీయం

- విజయవాడలో వరసిద్ధుడి పెళ్లికి పోటెత్తిన భక్తులు



మాంగల్యం చూపుతున్న వేదపండితులు



హోమం చేస్తున్న అర్చకులు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం విజయవాడలో స్వామివారి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్, సేవ్ టెంపుల్స్ భారత ఆర్గనైజేషన్ సంయుక్తంగా గాయత్రీ కల్యాణ మండపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తొలుత హోమం చేశారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామివారికి విశేషాలంకరణ చేసి, కల్యాణ మండపంలో కొలువు తీర్చి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి, తిలకించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సేవ్ టెంపుల్స్ ఆర్గనైజేషన్ సభ్యులు గజల్ శ్రీనివాస్, కాణిపాకం ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూమి విక్రయమంటూ రూ.కోటి టోపీ


- ఐదుగురు మోసగాళ్ల అరెస్టు

బనశంకరి (బెంగళూరు): తిరుపతి వద్ద రూ.కోట్ల విలువచేసే భూమిని విక్రయిస్తామని చిత్తూరు ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్తను పిలిపించి, ఆయన వద్ద నుంచి రూ.కోటి నగదు తీసుకుని మోసగించిన ఐదుగురిని మంగళవారం బెంగళూరు హైగ్రౌండ్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారివద్ద నుంచి రూ.65 లక్షల నగదు, రూ.8.50 లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు, ఇన్నోవా వాహనంతో పాటు నాలుగు కార్లను స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ దయానంద తెలిపారు. కేసు వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. బాధిత పారిశ్రామికవేత్త రాధాకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి బెంగళూరుకి చెందిన సంజయ్ శ్రీనివాస్, ముగిలేశ్వర్, ప్రభాకరరెడ్డి, రాజేశ్, రవికుమార్ అనే ఐదుగురిని అరెస్టు చేశారు. కొన్నిరోజుల కిందట.. తిరుపతిలో 14 ఎకరాల భూమిని అమ్ముతామని రాధాకృష్ణను బెంగళూరుకు పిలిపించారు. ఒక హోటల్‌లో మాట్లాడుకుని అడ్వాన్స్‌గా రూ.కోటి 9 వేలను వసూలు చేశారు. భూమిని చూపిస్తామని ఆయన్ని కారులో తీసుకెళ్లి బెంగళూరు శివార్లలో ఓ షాపు వద్ద కారును ఆపారు. జూస్ తీసుకురావాలని రాధాకృష్ణను పంపారు. ఆయన షాపులోకి వెళ్లగానే దుండగులు కారు, నగదుతో ఉడాయించారు. బాధితుడు హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, ఫోన్ కాల్స్, హోటల్ వద్ద సీసీ కెమెరాల ఆధారంగా ఆధారాలు సేకరించి నిందితులను అరెస్టు చేశారు. మోసగాళ్లు అడ్వాన్స్ సొమ్ములో కొంత ఖర్చు చేయడంతో పాటు కొంత బంగారం, విలువైన వస్తువులను కొనుగోలు చేశారు.



సీజ్ చేసిన నగదును పరిశీలిస్తున్న కమిషనర్ దయానంద్

జాతీయ స్థాయి హాకీ క్రీడకు సర్కారు విద్యార్థి



కమల్‌ను అభినందిస్తున్న టీచర్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎం.అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కమల్ జాతీయ స్థాయి హాకీ క్రీడకు ఎంపికయ్యారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో అనకాపల్లి జిల్లా నక్కపల్లె జెడ్పీ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఆ విద్యార్థి హాకీలో ప్రతిభ చూపి, జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. విద్యార్థి కమల్, శిక్షణ ఇచ్చిన పీఈటీ సుజాతను హెచ్ఎం విజయ, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

రైతులకు మెగా చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి రోజా, కలెక్టర్ వెంకటరమణారెడ్డి



హాజరైన లబ్ధిదారులు



రైతుకు భరోసా!

- అట్టహాసంగా వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్
- తిరుపతి జిల్లాలో 1,80,654 మందికి లబ్ధి
- రూ.73.95 కోట్లు జమ చేసిన ప్రభుత్వం
- పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా

'దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఒక అడుగు ముందుకేస్తే.. ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెండడుగులు ముందుకేశారు. గత పాలకులు దండగ అన్న వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మి, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. రైతు భరోసా కింద ఏటా ఒక్కో రైతుకు రూ.13,500 అందజేస్తున్నారు' అని మంత్రి ఆర్కే.రోజా కొనియాడారు. మంగళవారం వడమాలపేట ఎస్ఆర్‌టీ కల్యాణ మండపంలో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఐదో ఏట, రెండో విడత కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు.

పుత్తూరు రూరల్: దివంగత మహానేత, రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయాన్ని పండుగ చేశారని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా కొనియాడారు. మంగళవారం వడమాలపేట ఎస్ఆర్‌టీ కల్యాణ మండపంలో జరిగిన జిల్లా స్థాయి వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ఐదో ఏటలో రెండో విడత నగదు జమ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు భరోసా కింద ప్రతి రైతుకూ ఏటా రూ.13,500 ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో 1,80,654 మందికి లబ్ధి

రాష్ట్ర వ్యాప్తంగా వరుసగా ఐదో ఏడాదిలో రెండో విడతగా రైతు భరోసా, పీఎం కిసాన్ కింద 53.53 లక్షల మంది రైతన్నలకు, రూ.2,204.77 కోట్లను సీఎం జగనన్న బటన్ నొక్కి రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేశారని వివరించారు. ఒక్క తిరుపతి జిల్లాలోనే 1,80,654 మంది రైతుల ఖాతాల్లో రూ.73.95 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఐదేళ్లలో ఒక్క రైతు సంక్షేమం కోసమే వివిధ పథకాల ద్వారా 320.62 లక్షల మంది రైతులకు రూ.1,75,007 కోట్ల ఆర్థిక సాయం అందించినట్లు వివరించారు.

వ్యవసాయాభివృద్ధికి వినూత్న పథకాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గానికి ఒక అగ్రిల్యాబ్ ఏర్పాటు చేసి నిపుణులతో విత్తనం విత్తే సమయం నుంచి పంట కోత వరకు తగిన సూచనలు, సలహాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. సున్నా వడ్డీ, పంట రుణాలు, ఉచిత పంటల బీమా, 9 గంటల పాటు నాణ్యమైన విద్యుత్, ఈక్రాప్ బుకింగ్, యంత్రాల కోసం సీహెచ్‌సీ గ్రూపుల ఏర్పాటు, వైఎస్సార్ యంత్ర సేవా వంటి పలు పథకాల ద్వారా రైతుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. అలాగే రైతులతో పాటు వారి పశు సంపద అభివృద్ధి చెందడానికి వైఎస్సార్ పశు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం వీక్షించిన అనంతరం కలెక్టర్, సంబంధిత అధికారులతో కలిసి రూ.73.95 కోట్ల మెగా చెక్కును మంత్రి రోజా రైతులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, మైక్రో ఇరిగేషన్ అధికారి సతీష్, ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, నగరి నియోజకవర్గ పార్టీ పరిశీలకులు మధుసూదనరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్రమణ్యంరెడ్డి, యాదవేంద్రరెడ్డి, కరుణాకర్‌చౌదరి, సురేష్‌రాజు, చంద్రారెడ్డి, కిరణ్‌కుమార్, విజయలక్ష్మి, మునివేలు, మునెమ్మ, మంజుల, అంజమ్మ, కమల, చంద్రరాజు, శేఖర్, సుధీర్‌రెడ్డి, నందయ్య, మదన్‌మోహన్‌రెడ్డి, హరి, శంకర్, జయప్రకాష్, భాస్కర్‌యాదవ్, శ్రీనివాసులురెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆసక్తి, ఆచరణతో పారిశ్రామికంగా ఎదుగుదల



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్ర సహాయ సంచాలకులు కృష్ణకిషోర్

నగరి : పారిశ్రామికంగా ఎదగాలన్న ఆసక్తి ఉండి, దాన్ని ఆచరణలో పెట్టగలిగితే పారిశ్రామిక రంగంలో ఎదగవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్ర సహాయ సంచాలకులు కృష్ణకిషోర్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో స్థానిక చిన్నతరహా పరిశ్రమ నిర్వాహకులు, నిరుద్యోగులు, ప్రజాప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎంఈజీపీ పథకంలో పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. కోళ్లు, మేకలు పెంపకం పరిశ్రమకు ఈ పథకంలో 35 శాతం సబ్సిడీ కింద రుణాలు మంజూరు చేస్తామన్నారు. పరిశ్రమ స్థాయి ఆధారంగా రుణం అందిస్తామని, అందుకు పరిమితి లేదన్నారు. గతంలో సబ్సిడీ రుణాలు పొంది పరిశ్రమలు నడిపేవారు వారి పరిశ్రమను విస్తరించుకుంటే వాటికి మళ్లీ సబ్సిడీ అందిస్తామన్నారు. అయితే అది పారిశ్రామిక నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. రుణం పొంది పరిశ్రమ స్థాపించాలన్న ఆసక్తి ఉన్నవారు బ్యాంకర్లను సంప్రదించి వారి వివరాలను తెలియజేస్తే రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. వారికి పీఎంఈజీపీ పథకంలో తాము సబ్సిడీని అందిస్తామన్నారు. పారిశ్రామిక అభివృద్ధి విధానం, వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం, ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమాలపై ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ డి.సంజీవరాజు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, ఎంపీపీ భార్గవి, వైస్ఎంపీపీ కన్నియప్ప, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రామకుప్పం: మండలంలోని వీర్నమల పంచాయతీ నల్లరాళ్లచేనులో సోమవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు శేషాద్రి ఫిర్యాదు మేరకు.. నల్లరాళ్లచేనుకు చెందిన శేషాద్రి(42) తన పొలం వద్ద ఇల్లు నిర్మించుకున్నాడు. శేషాద్రి కుటుంబసభ్యులతో కలసి ఉపాధి కోసం బెంగళూరుకు వలస వెళ్లాడు. ఇంట్లో అతని తల్లి కాంతమ్మ ఉంటోంది. ఈ క్రమంలో కాంతమ్మ కాలికి గాయం కావడంతో చికిత్స నిమిత్తం వీర్నమల ఆస్పత్రికి వెళ్లింది. చీకటిపడడంతో సోమవారం రాత్రి వీర్నమల గ్రామంలోని ఆమె సోదరి సరసమ్మ ఇంట్లో ఉండిపోయింది. ఉదయం ఇంటి వద్దకు వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉండడం గమనించి అవాక్కైంది. వెంటనే ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. దీంతో కాంతమ్మ బీరువాను తనిఖీ చేయగా అందులోని 28 గ్రాముల బంగారు నెక్లెస్, చైన్, కమ్మలు, జుమ్కీలు, వెండితో చేసిన 200 గ్రాముల జ్యోతులు, 100 గ్రాముల కామాక్షమ్మ దీపం, 200 గ్రాముల కాళ్ల గొలుసులు చోరీకి గురైనట్లు గుర్తించింది. దీంతో మంగళవారం కాంతమ్మ తన కుమారుడు శేషాద్రికి సమాచారం అందజేసింది. అతడు వచ్చి, పరిశీలించి, రామకుప్పం పోలీసులకు చోరీ విషయమై ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.1.32 లక్షలు విలువ చేసే బంగారు, వెండి చోరీ జరిగినట్లు పోలీసులకిచ్చిన ఫిర్యాదు పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మురళీబాబు తెలిపారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

చిత్తూరు అర్బన్: ఎవరికీ చెప్పకుండా చెరువులో ఈతకు వెళ్లిన విద్యార్థి శవమై తేలాడు. వన్‌టౌన్ ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. నగరంలోని మురుగానిపల్లెకు చెందిన గుణశేఖర్ అనే వ్యక్తి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో కెమిస్ట్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి ప్రణీత్ అనే కుమారుడు ఉన్నాడు. ఈ బాలుడు ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. కొంగారెడ్డిపల్లె సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ సమీపంలో ఉన్న చెరువులో ఈత కొట్టాలని తన తండ్రిని పలుమార్లు అడగడంతో అందుకు తండ్రి వద్దని చెప్పేవాడు. అయితే సోమవారం పాఠశాలకు వెళ్లిన ప్రణీత్ సాయంత్రమైనా ఇంటికి రాలేదు. అన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో మంగళవారం ఉదయం ఐటీఐ సమీపంలోని చెరువుగట్టుపై సైకిల్, యూనిఫామ్ కనిపించాయి. అనుమానం వచ్చి కుంట వద్దకు వెళ్లి చూస్తే ప్రణీత్ శవమై తేలుతూ కనిపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్వారీ గుంతలో పడి మహిళ మృతి



రాజేశ్వరి మృతదేహం

వెదురుకుప్పం: మండంలోని ఓ వివాహిత మంగళవారం సాయంత్రం క్వారీ గుంతలో పడి మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. శ్రీరంగరాజపురం మండలం కటికపల్లె ఎస్టీ కాలనీకి చెందిన ఉమాపతి భార్య రాజేశ్వరి(28) పిల్లిగుండ్లపల్లె అటవీ ప్రాంతంలో పశువులు మేపు కోవడానికి పశువుల కాపరులతో కలిసి వెళ్లింది. ఈ సమయంలో బహుర్భూమికి వెళ్లి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి ఓ క్వారీ గుంతలో దిగగా ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయింది. ఈ ఘటనలో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న వెంటనే పోలీసు సిబ్బంది, అగ్నిమాపక సిబ్బందితో కలసి గాలింపు చర్యలు చేపట్టి గంట వ్యవధిలోనే మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ వెదురుకుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎంఈఓకు గాయాలు

వి.కోట: మండలంలోని కుమ్మరమగుడు మలుపులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కుప్పం ఎంఈఓ తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. కుప్పం ఎంఈఓగా పని చేస్తున్న మహబూబ్‌బాషా చిత్తూరులో జరిగిన సమావేశానికి హాజరై, తిరిగి కుప్పం పట్టనానికి తన కారులో బయలుదేరారు. ఈ క్రమంలో వి.కోట–పలమనేరు జాతీయ రహదారిలోని కుమ్మరమడుగు క్రాస్ వద్ద వి.కోట నుంచి బైరెడ్డిపల్లెకు వెళుతున్న పాల వ్యాన్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎంఈఓ మహబాబ్ బాషా తీవ్రంగా గాయపడ్డారు. ఈ విషయం గుర్తించిన స్థానికులు అతన్ని కుప్పం పీఈఎస్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర వాలీబాల్ జట్ల ఎంపిక



బాలికల జట్టు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–19 ఆంధ్ర రాష్ట్ర బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ తిరుపతి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య మంగళవారం తెలిపారు. ఈ నెల 4నుంచి 6వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–19 బాలబాలికల పోటీలను తిరుపతిలో నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలబాలికల జట్లు పాల్గొన్నాయని, అందులో ఉత్తమ ప్రదర్శన కనబరచిన బాలబాలికలతో 15 ప్లస్ 15మంది క్రీడాకారులతో రాష్ట్రజట్లను ఎంపిక చేసినట్లు చెప్పారు. త్వరలో జాతీయస్థాయిలో నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్–19 వాలీబాల్ పోటీ ల్లో ఈ జట్లు రాష్ట్రం తరఫున పాల్గొంటాయన్నారు.

ఏపీ స్టేట్ అండర్–19 బాలుర జట్టు..

ఎస్.కనిష్క, పి.సాహిత్‌చందు, ఎల్.రమేష్(విశాఖపట్నం), కె.పవన్‌కుమార్, జి.సాయి దుర్గాప్రసాద్(పశ్చిమ గోదావరి), ఏసీకె.వెంకటేష్ (వైఎస్సార్ కడప), ఎస్.పవన్ (విజయనగరం), టి.ఆదిత్య, పి.మహేష్ (తూర్పు గోదావరి), ఎం.సత్యం, ఎం.భానుప్రసాద్(శ్రీకాకుళం), జి.సాయి (చిత్తూరు)తో పాటు స్టాండ్‌బైగా కె.హైదిరాజు (విశాఖపట్నం), జి.గౌతం (కృష్ణ), ఎం.మణికంఠారెడ్డి (ప్రకాశం)ఎంపికయ్యారు.

ఏపీ అండర్–19 బాలికల జట్టు..

ఎస్.సంజన, బి.మేఘన, బి.గుణప్రియ, వి.మనోజ్ఞ(కృష్ణ), ఎస్.శ్రీవల్లి, ఎం.జ్యోష్ణ, ఎం.పావని(గుంటూరు), జి.జగదీశ్వరి, పి.వ్యూహిత (విశాఖపట్నం), స్వప్న (అనంతపురం), జె.మోక్షజ్ఞ (చిత్తూరు), బి.ఏసుమణి (తూర్పు గోదావరి)తో పాటు స్టాండ్‌బైగా ఎ.లక్ష్మి (తూర్పు గోదావరి), పి.రేవతి (చిత్తూరు), పి.బేబి సునీత (గుంటూరు) ఎంపికయ్యారు.

9, 10 తేదీల్లో..

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో స్పీచ్ స్కేటింగ్, బేస్‌బాల్ అండర్–19 బాలబాలికల ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్లు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 9వ తేదీ ఉదయం 8.45 గంటలకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్పీచ్ స్కేటింగ్ జట్ల ఎంపిక ఉంటుందన్నారు. అలాగే 10వ తేదీ మధ్యాహ్నం 2.15 గంటలకు తిరుపతి సమీపంలోని మంగళం ట్రెండ్స్ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సాఫ్ట్‌బాల్ బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు ప్రస్తుతం ఇంటర్ చదివే బాలబాలికలు అర్హులని, పోటీలకు హాజరయ్యే వారు పది మార్క్‌లిస్ట్, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తీసుకురావాలని ఆయన కోరారు.

భరత్‌కు అవకాశం ఇవ్వరూ!



రామకుప్పం: మహిళలకు పసుపు కుంకుమ ఇస్తున్న దుర్గ

- సింగసముద్రంలో ఎమ్మెల్సీ సతీమణి దుర్గ అభ్యర్థన

రామకుప్పం: చిత్తూరు ఎమ్మెల్సీ భరత్‌కు కుప్పం ఎమ్మెల్యేగా ప్రజలు రాబోవు ఎన్నికల్లో ఒక అవకాశం ఇస్తే అభివృద్ధిలో అగ్రగామిగా కుప్పాన్ని నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆయన సతీమణి దుర్గ పేర్కొన్నారు. మండలంలోని సింగసముద్రం పంచాయతీలో మంగళవారం ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ, చీరను ఇచ్చి ఆమె పై విధంగా అభ్యర్థించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భరత్‌ను గెలిపించాలని కోరారు. గత పదేళ్లుగా కుప్పంలోనే స్థిర నివాసం ఉంటున్నామని, నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలను భరత్ పరిష్కరిస్తున్నట్టు చెప్పారు. చంద్రబాబు ఏ రోజూ ప్రజలతో మమేకమైందని లేదని ప్రజలు దీనిని గుర్తించి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న నవరత్నాలతో అన్ని వర్గాల ప్రజలు మేలు పొందారని, ఇవి కొనసాగించాలంటే మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి సీఎం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, కో–కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం ,వన్నికుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, కుప్పం ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ లలిత, స్థానిక సర్పంచ్ చిన్నతాయమ్మ, ఎంపీటీసీ అనిత, వైస్ సర్పంచ్ సుబ్బారెడ్డి, పార్టీ ప్రచార కార్యదర్శి కేశవ రెడ్డి, జయప్ప, చెంగారెడ్డి, జాబీర్ పాల్గొన్నారు.

తనయుడి కోసం తల్లి ప్రచారం

కుప్పం: ప్రజలకు సేవ చేసేందుకు తన కుమారుడైన చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాడని, రాబోవు ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ప్రజలు ఒక అవకాశం ఇవ్వాలని భరత్ తల్లి పద్మమ్మ కోరారు. మంగళవారం ఆమె వి. మిట్టపల్లెలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. తన భర్త చంద్రమౌళి రెండుసార్లు పోటీ చేసి ఓటమి చెందారని, ఆ తర్వాత ఆయన అనారోగ్యంతో కన్ను మూశారని, తండ్రి ఆశయ సాధన కోసం భరత్ కుప్పం ప్రజలకు సేవ చేయాలనే బలమైన సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాడన్నారు. తన కొడుకును, వైఎస్సార్ సీపీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

కోడి పందెం రాయుళ్ల అరెస్టు

రొంపిచెర్ల: కోడి పందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.4100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. ఇలా ఉన్నాయి. మండలంలోని గానుగచింత సమీపంలో మంగళవారం సాయంత్రం కోడి పందెం ఆడుతున్నారని అందిన రహస్య సమాచారం మేరకు పోలీసులు ఆ ప్రాంతంలో దాడులు చేసి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.4100 నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే నాలుగు ద్విచక్ర వాహనాలు, మూడు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మరో ముగ్గురు పరారయ్యారని ఎస్ఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఈ దాడిలో పోలీసులు బాలకృష్ణయ్య, వేణుగోపాల్, అలీ పాల్గొన్నారు.







